క్లుప్తంగా

వికారాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా నూతనంగా వచ్చిన ప్రతీక్ జైన్‌ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఆయన వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి వికారాబాద్ జిల్లాకు వచ్చినందుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా వికారాబాద్ అభివృద్ధికి, నవాబుపేట మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్



పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ నరేందర్, సీఐ ప్రతాప్‌లింగం

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని తద్వారా మానసిన ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని పట్టణంలోని గంజ్ ఆవరణలో ఉన్న వినాయక దేవాలయంలో మంగళవారం బీఆర్‌ఎస్ నేత మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ పాల్గొని మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ ప్రతాప్ లింగం, ఒగ్గు కిషోర్, శేఖర్, జూపల్లి శంకర్, వెంకటేశ్‌గౌడ్, మహవీర్, కోటిలింగం, శ్రీశైలం గౌడ్, అభిలాశ్, భూషణ్, నరేశ్, పాండు, శ్రీధర్, రవి, శేఖర్, నర్సింలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్, షూస్ అందజేస్తున్న దాత రాజు

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను దాతలు ప్రోత్సహించడం అభినందనీయమని చిలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నర్సింలు అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జీఆర్ ఫౌండేషన్, గరుగు రాజు యువసేన ఆధ్వర్యంలో మంగళవారం స్పోర్ట్స్ డ్రెస్, షూస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివేది అధికంగా పేద విద్యార్థులేనని వారికి ప్రోత్సాహం అందించడానికి దాతలు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. స్పోర్ట్స్ డ్రెస్, షూస్ అందజేసిన దాత గరుగు రాజు మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగర్‌కుంట తాజ్ పౌల్ట్రీఫామ్‌ను తొలగించాలి

షాబాద్: నాగర్‌కుంట తాజ్ పౌల్ట్రీఫామ్‌ను వెంటనే తొలగించాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కన్వీనర్ అల్లి దేవేందర్ పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎండీ అన్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామ సమీపంలోని తాజ్ పౌల్ట్రీఫామ్ నుంచి తీవ్రమైన దుర్వాసన రావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. వెంటనే తాజ్ పౌల్ట్రీఫామ్ తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి ఆ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పౌల్ట్రీఫామ్ ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్సింహ, మురళీ, రఘురాం, శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఖాళీ కుర్చీ ఇంకెన్నాళ్లు?

- ఏప్రిల్ 26న సస్పెండ్ అయిన డిప్యూటీ తహసీల్దార్
- అప్పటి నుంచి ప్రజల తప్పని ఇక్కట్లు



కొందుర్గులో ఖాళీగా ఉన్న డిప్యూటీ తహసీల్దార్ కుర్చీ

కొందుర్గు: కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏప్రిల్ 26న డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్యను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు వివిధ పనులపై కార్యాలయానికి వచ్చిన ప్రజలు పనులు కాక ఇబ్బందిపడుతున్నారు. డిప్యూటీ తహసీల్దార్ విధుల్లో ఉన్న సమయంలో భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారాలు చూసుకునేవారు. కాగా తహసీల్దార్ రమేశ్‌కుమార్ కార్యాలయ పనులతో పాటు, ఇతర సభలు, సమావేశాలు చూసుకునేవారు. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్ లేకపోవడంతో తహసీల్దార్ రమేశ్‌కుమార్ రిజిస్ట్రేషన్ వ్యవహారాలు చూడటంతో ఇతర కార్యాలయ పనులు సజావుగా సాగడం లేదు. అంతేగాక తహసీల్దార్ సెలవు పెట్టినా, ఇతర పనులకు వెళ్లినా, సభలు, సమావేశాలకు వెళ్లినా రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయని మండల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని డిప్యూటీ తహసీల్దార్‌ను నియమించాలని కోరుతున్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్



షాబాద్‌లో మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈ నెల 26 (నేడు బుధవారం) విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. గత ప్రభుత్వాల్లో ఎలాంటి సమస్యలు అయితే ఉన్నాయో అవే సమస్యలు ఇంకా ఎదురవుతున్నాయన్నారు. పాఠశాలల భవనాల కొరత, ఉపాధ్యాయుల కొరతతో భయపడి తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారని వాపోయారు. దీన్ని ఆసరాగా చేసుకొని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పేద మధ్య తరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి విజయ్, నాయకులు ప్రవీణ్, నిఖిల్, మధు, మల్లేశ్, లోకేశ్, మోహన్ ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

చేవెళ్ల: విద్యారంగ సమస్యలను పరిష్కరించి విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి మహిపాల్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏబీవీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 26 (నేడు బుధవారం) ఏబీవీపీ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చిందన్నారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం వహించొద్దని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు రాఘవేందర్, ప్రేమ్, పవన్, రేవంత్, ప్రవీణ్ ఉన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం



నాగేశ్‌బాబు దంపతులను సన్మానిస్తున్న పోచయ్య, తదితరులు

ఎస్‌టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పోచయ్య

మొయినాబాద్‌రూరల్: ఉద్యోగ రీత్యా ఏ ఉన్నత స్థాయిలో ఉన్న పదవీ విరమణ అనేది ఉద్యోగులకు సహజమేనని రాష్ట్ర ఎస్‌టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు యూ.పోచయ్య అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఏ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేసిన సోమిశెట్టి నాగేశ్‌బాబు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనకు పాఠశాల హెచ్‌ఎం రేణుక, గ్రామస్తులు కలిసి సన్మాన సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోచయ్య, మండల విద్యాధికారి ఎం.వెంకటయ్యలు పాల్గొని సోమిశెట్టి నాగేశ్‌బాబు దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ.. పదవీ విరమణ ఉద్యోగ రీత్యా సహజమేనన్నారు. ఉద్యోగులు తమ బాధ్యతను మరచిపోకుండా విధులు నిర్వహిస్తేనే గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు హిమాయత్‌నగర్ ఆంజనేయులు, అమ్డాపూర్ రేణుక, అమ్డాపూర్ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, పాఠశాల కో-ఆప్షన్ సభ్యులు వడ్ల నర్సింహాచారి, బూర్గు గోపికృష్ణారెడ్డి, అశ్విని, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, బందయ్య, గోపాల్, సత్యనారాయణరెడ్డి, మెహర్ ఉన్నీసాబేగం, అమ్డాపూర్ గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఏమాయె సారూ?

బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కాట్న శేఖర్

నందిగామ: జూన్ మొదటి వారంలో రైతులకు రావాల్సిన రైతుభరోసా జూన్ నెల ముగుస్తున్నా కూడా నేటివరకు ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, నర్సప్పగూడ మాజీ ఉపసర్పంచ్ కాట్న శేఖర్ ప్రశ్నించారు. మండల కేంద్రమైన నందిగామలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతులు ఇబ్బందిపడొద్దని పెట్టుబడి కింద విత్తనాలు నాటే సమయంలోనే రైతుబంధు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తొలకరి వర్షాలు కురుస్తున్న సమయంలో రైతులకు పెట్టుబడి సాయం కింద ఇవ్వాల్సిన రైతుభరోసా నేటికీ రైతుల ఖాతాల్లో ఎందుకు జమచేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుభరోసా నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించండి

ఎమ్మెల్యేకు కళాశాల సిబ్బంది వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

షాద్‌నగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ మంగళవారం కళాశాల సిబ్బంది ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కుర్షియా బేగం ఆధ్వర్యంలో అధ్యాపకులు ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాలలో సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కళాశాలలో తాగునీటి వసతి, మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా కాంపౌండ్ వాల్‌ను నిర్మించాలని, కొన్ని తరగతి గదుల్లో ఫ్లోరింగ్ చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు చేపడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ముబారక్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జీరో బిల్లుపై ప్రజల ఆందోళన



ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చిన ప్రజలు

చేవెళ్ల: గృహజ్యోతి పథకం ఉచిత కరెంట్ రావటం లేదంటూ ఎంపీడీఓ కార్యాలయానికి ప్రజలు పరుగులు తీస్తున్నారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రతిరోజు ప్రజలు తమకు ఉచిత కరెంట్ అమలు కావటం లేదంటూ దరఖాస్తులు పట్టుకొని వస్తూ కనిపిస్తున్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ప్రజలు క్యూలైన్‌లో నిలబడ్డారు. తమ దరఖాస్తులు ఏమయ్యాయి తాము ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నామని ఆ నెంబర్‌ను తీసుకొని కరెంట్ బిల్లును తీసుకొచ్చి అధికారులను అడుగుతున్నారు. దీంతో కార్యాలయం ప్రతిరోజు సందడిగా కనిపిస్తోంది. కంప్యూటర్ ఆపరేటర్లు వచ్చిన ప్రజలకు ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి వివరాలు చెబుతున్నారు. దరఖాస్తులు చేసుకొని వారు అయితే వారి దరఖాస్తులు తీసుకుంటున్నారు.

సీఐకి సన్మానం



సీఐ ప్రతాప్‌లింగంను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ సేవా పథకానికి ఎంపికైన షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాప్‌లింగంను మంగళవారం ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమన్నారు. సమాజంలో శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ఉత్తమ సేవా పథకానికి ఎంపిక కావడం హర్షణీయమన్నారు.కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌వర్మ, వెంకటేశ్, రాములు, అశోక్, గిరిబాబు, శ్రీశైలం, నర్సింలు, బాల్‌రాజ్, నర్సింలు, సతీశ్, అంజయ్య, చంద్రయ్య, కృష్ణయ్య, శ్రీశైలం, మల్లేశ్ పూజారి, రమేశ్, శ్రీకాంత్, ప్రశాంత్, అజయ్‌వర్మ, భీమయ్య, శ్రీను, గణేశ్ పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న ఎంపీడీఓ కార్యాలయం



ప్రారంభానికి ముస్తాబవుతున్న మండల పరిషత్ కార్యాలయం

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలో ఉన్న మండల పరిషత్ కార్యాలయం నందిగామ గ్రామ పంచాయతీ భవనంలోకి త్వరలో తరలించనున్నారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ భవనానికి రంగులు వేసి, బోర్డులు రాశారు. నందిగామను కొత్తూరు మండలం నుంచి విడదీసి నూతనంగా మండల కేంద్రముగా ఏర్పాటు చేసిన తర్వాత మండల పరిషత్ భవనం ఓ ఇరుకు ఇంట్లో అద్దెకు ఉండేది. అదేవిధంగా నందిగామ గ్రామ పంచాయతీ భవనంలోని పైభాగంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఉండగా, కింది భాగంలో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్‌కు నూతనంగా భవనాన్ని నిర్మించడంతో నూతన భవనంలోకి పోలీస్ స్టేషన్‌ను గతంలోనే తరలించారు. దీంతో గతంలో పోలీస్ స్టేషన్ ఉన్న భవనం ఖాళీగా ఉండటంతో ఆ భవనానికి ఇటీవల మరమ్మతులు నిర్వహించి, రంగులు వేశారు. త్వరలోనే ఎంపీడీఓ కార్యాలయాన్ని గ్రామ పంచాయతీ భవనంలోకి మార్చనున్నారు. ఇంతకాలం ఇరుకు గదుల్లో కొనసాగిన మండల పరిషత్ భవనం ఇక నుంచి కొంత మేరకు విశాలమైన భవనంలోకి మారనుండటంతో అటు అధికారులకు, ఇటు మండల ప్రజలకు మేలు జరుగనుంది. ఈ వారంలో కార్యాలయాన్ని మార్చనున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది.

సమాజానికి ఉపయోగపడితేనే గుర్తింపు

చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కులపతి డా.పురుషోత్తమ్‌రెడ్డి



యూనివర్సిటీలో డాక్టరేట్ అందుకుంటున్న వెంకటేశ్వర్లు

మొయినాబాద్‌రూరల్: పరిశోధనలు సమాజంలో ప్రజలకు ఉపయోగపడేలా ఉన్నప్పుడే గుర్తింపు లభిస్తుందని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కులపతి డాక్టర్ సీ.హెచ్.పురుషోత్తమ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలో గల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో వెంకటేశ్వర్లు వాణిజ్యం, వ్యాపార నివారణ విభాగంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ ఇన్ బ్యాంకింగ్ సెక్టార్ ఏ కంపారిటీవ్ స్టడీ ఆఫ్ సెలక్ట్ పబ్లిక్ అండ్ ప్రైవేటు సెక్టార్ బ్యాంక్స్ అనే అంశంపై ప్రొఫెసర్ దీప్తిశ్రీ పర్యవేక్షణలో వెంకటేశ్వర్లు పరిశోధన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లును డాక్టర్ పురుషోత్తమ్‌రెడ్డి అభినందించి డాక్టరేట్ అందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా పరిశోధనలు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి, వైస్ ఛాన్సలర్ కృష్ణఫర్, రిజిస్ట్రార్ రవీందర్, జగదీశ్వర్, ప్రతాప్, రాజేందర్, రాజు, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: నిరుపేదలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన జంగయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దశరథ్‌నాయక్ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.25వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేశ్ గుప్తా, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు రామకృష్ణ, పాండు నాయక్, లాయక్ అలీ, నర్సింహ, కృష్ణ, అంజి, శ్రీను, మహేశ్, పాండు, సురేశ్, శ్రీకాంత్, రాజా, రాములు, శివ ఉన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటాం



మైనింగ్ తవ్వకాలతో ఏర్పడిన పెద్ద గుంతలో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం చేవెళ్ల డివిజన్ ఇన్‌చార్జి దేవేందర్

చేవెళ్ల: మండలంలోని అంతారం రెవెన్యూ పరిధిలో జరుగుతున్న మైనింగ్ జోన్‌తో పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని దీనిని పూర్తిగా రద్దు చేయాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ ఇన్‌చార్జి అల్లి దేవేందర్ అన్నారు. అంతారం సమీపంలో జరుగుతున్న మైనింగ్ జోన్‌ను మంగళవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతారం సమీపంలో ఎస్ఆర్ మినరల్స్ మైనింగ్‌ను గత 15ఏళ్లుగా నిర్వహిస్తూ పర్యావరణానికి హానీ కలిగిస్తున్నారన్నారు. ఈ మైనింగ్‌తో అంతారం, హస్తేపూర్ గ్రామాలతో పాటు చుట్టుపక్క ఉన్న ఇతర గ్రామాల ప్రజలకు, మూగజీవాలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయన్నారు. ఈ నెల 27న మళ్లీ కొత్తగా కొంత భూమిలో మైనింగ్ తవ్వకాలకు అనుమతులు కోరుతూ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణను సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి అడ్డుకుంటామని చెప్పారు. గతేడాది కూడా లాటరైట్ అనంతరం బసల్ట్ తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారన్నారు. అ ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎదుట అంతారం గ్రామస్తులు ముక్తకంఠంతో బసల్ట్ తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని మైనింగ్‌ను పూర్తిగా తొలగించాలని చెప్పారన్నారు. కానీ ప్రభుత్వ అధికారులు మాత్రం ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజా అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండానే ఎస్ఆర్ మినరల్స్‌తో కుమ్మక్కై మైనింగ్ తవ్వకాలు కొనసాగించారన్నారు. ఈ ప్రదేశంలో ఇప్పుడు పెద్ద గుంతలు ఏర్పడి అందులో నీళ్లు నిలిచాయన్నారు. దీంతో చుట్టూ ఉన్న రైతులు తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. బసల్ట్ తవ్వకాల్లో బ్లాస్ట్‌లు చేయటంతో భూకంపం వచ్చినట్లుగా భూమి కదలికలతో ప్రజలు భయభ్రాంతులకు గురైన సంఘటనలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే గ్రామ ప్రజలు గ్రామసభ ఏర్పాటు చేసి మైనింగ్ వద్దని తీర్మానం చేశారన్నారు. ఈ నెల 27న జరిగే ప్రజాభిప్రాయసేకరణను అడ్డుకుంటామని, సీపీఎం దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలోనాయకులు ప్రకాశ్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

రోడ్లపైనే పారుతున్న మురుగు నీరు ● పట్టించుకోని అధికారులు



రోడ్డు పక్క నుంచి తీసిన కాల్వలో పారుతున్న మురుగునీరు

మొయినాబాద్: మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. గ్రామం విస్తరించి కొత్తగా ఏర్పడిన కాలనీల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. దీంతో రోడ్లపైనే, కాల్వల ద్వారా డ్రైనేజీ నీరు పారుతోంది. దీంతో దుర్వాసన, ఈగలు, దోమలు చేరి రోగాలు బారిన పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, కొత్త కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లు సరిగా లేవని పంచాయతీ అధికారులను విన్నవించినా పట్టించుకోలేదని చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారి గ్రామంలో సమస్యలను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.